హద్దులు

కథానిక

అల్లం రాజయ్య

బయట ఎండ నిప్పులు చెరుగుతోంది. లోపల బాగా ఉక్కగా ఉంది.. అప్పుడే ఫీల్డు మీదినుండి వచ్చి హేట్ తీసి ముందున్న టేబుల్ మీద గిరవాటేశాను. ఒళ్ళంతా హూనం అయిపోయింది. ఎడ్లబండిలో రెండుమైళ్ళగతుకుల రోడ్డుమీద ప్రయాణం నిజంగా చచ్చేంతపని. ఈ ఊరు నిండా జనం బతికేఉన్నరు. ఊరులో కోరమీసాలదొరలున్నారు. ఏటా ధాన్యం ఈ ఊరి నుండి తరలించ బడుతూనే ఉన్నది....... .... పన్నులు కడుతూనే ఉన్నారు - ఇంతెందుకు ఈ గ్రామంనుండి దేశం అన్నివసూలుచేస్తోంది. అయినా ఈ ఊరికి రోడ్డులేదు...ఆ మాటకొస్తే ఈ ఊళ్ళో ఏదీ ఉన్నట్టుగా కన్పించలేదు. "ఏదీ" అంటే ఐ మీన్ కరంటు వగైరా....

వెదవుద్యోగం– ఊళ్ళవెంట తిరగాలే– తిరగకుంటే ఏమైపోద్ది ? కనిబండలు పీకేసి ఎంచక్కా! భూములన్ని కలిపేసి ఏదొరో తనపేరు పెట్టుకుంటడు. పట్వారి జనం దగ్గర శిస్తులు వసూలుచేస్తుంటడు. నేనొచ్చి కనిబండలు నిలబెట్టగలనా ? నేను నిలబెట్టిన కనిబండలు ఎంత కాలముంటాయి. నేను గీచిన హద్దులు / అలాగే ఉంటాయా ? పీక వేసేవాళ్ళు, పీకించు కునేవాళ్ళు ఉండగా.... పాతేవాడికేం విలువ ? ఇవ్వాల్ల నేను పాతిన కనిబండ ఎవరి కోసం ? దొరకోసం— దొర పొలానికి నీల్లు కావాలని ఆర్. డి. వో. స్పెషల్ తాఖీదు.

వాడుగూని, పొట్టిమీసాల మన్నెపోడు నేను ఒడ్డుమీద నిలబడితె చూచిన చూపు.... ముఖం మీద కాండ్రకించి ఉమ్మినట్టుగా ఉంది. మీరంతా తోడు దొంగలు అన్నట్టుగా ఉన్నది.

"నీపేరేమిటోయ్...?"

"లింగన్న బాంచెన్...."

"ఈమాట..నూటనాలుగోనంబరు పొలం పుట్టిన దగ్గర నుండి ఇందులో కాలువ ఏర్పాటున్నది. ఈ కాలువ నీటితో క్రింద యాభయి ఎకరాల భూమి పారాల్సి ఉన్నది."

"దరమ దొరలు.... తమరన్నది సచ్చమో ! అవద్దమో నా కెరుకా బాంచెన్ ? నీబాంచెన్, మాకెరుకున్న

దొక్కటే- గది మీకెందుకు గని-నా పోరగండ్ల ముంగటి ఒక్క గిదొక్కటే బాంచెన్. పెద్ద కాలువ ఎంత పోగకొలె తీస్క పోయినా నా అబ తుమక అయిదు గుంటల పొలం ఒల్లక్వాలకు కాలువ కింద పోతది బాంచెన్..."

"పోతే నన్నేం చేయుమంటావ్--కాలువ లేకుండా యాభయెకురాలు."

"గీ గరీబోన్ని సూడుండ్లి బాంచెన్...."

ఆ తరువాత 'గరీబోన్ని' చూపు. ఒకవేపు ధర్మ దొరలంటునే- వాడి కళ్ళలో దొంగలన్న భావం. నేను వాడ ఐదు గుంటల భూమి దొరతో వానికిప్పించగలను... చట్టప్రకారం నష్ట పరిహారం చెల్లించాలి కూడా... కాని దొర చేసిన 'ఇంతెజాములు'- దొర కోసిన కోడి- దొరవింపిన గాజుగ్లాస్.... గుండెలో నిశామంట... నా సెక్స్ వీక్ నెస్...

లింగం కళ్ళల్లో విసవాలు మంటను ఎదుర్కోవాలంటే ఇవ్వన్ని తప్పని సరి....

"తమరికి స్నానానికేర్పాట్లు చేయించేదా ?" పట్వారి డోర్ దగ్గర నిలబడి అడుగుతున్నాడు...

"ఛత్ అక్కర్లేదు..." నేను అనాలోచితంగా అన్నాను...

"ఎవరి నుండ్లి" పట్వారి ఉలిక్కి పడ్డాడు....

"విస్కి కాదులే...."

నాకుస్నానం చేయాలనిపించలేదు లింగని చూపే మనసులో-అంతా కుదుపుల కాపతు నొప్పులు, భరించరాని ఉక్క. మనసు నిండా చెత్త....నన్ను ఈ స్త్రీ వ్యామోహం వదులదు....నేను ఈ రోజు ఇక్కడ ఉండక తప్పదు.

"కాపేపాగు..." ఇంకా పట్వారి అక్కడే ఉన్నాడు....

నేను వెళ్ళి పొమ్మన్నట్లుగా సైగ చేశాను. పట్వారి వెళ్ళిపోయాడు.

కనులుమూసుకొని కుర్చీలో కూలబడ్డాను... ఎందరి భూములు దొరల పేర రాశాను..? ఫలితంగా ఎన్ని కానుకలు స్వీకరించాను ? ఇవ్వాళ్ల లింగడు నన్ను సవాలు చేస్తున్నాడు ... ఎంత సేవయ్యిందో అలా కూర్చొని...

బయట వేపచెట్టుమీద కాకులు అరుస్తున్నాయి. . . .

"దరమ దొరలు బాంచెన్...," ఎవరిదో స్త్రీ గొంతు వినిపించే సరికి ఉలిక్కిపడి కళ్ళు తెరిచాను... సూర్యుడు అస్తమించినట్లుగా-ఉంది... దూరంగా బజారులో దుమ్ము రేపుతూ పశువుల మంద కన్పించింది...

నా ముందు నాముఖంలోకి చూస్తూ దాదాపు ఇరువై దాటిన స్త్రీ నిలబడి యున్నది. కోలముఖం - గుండ్రటికళ్ళ- కళ్ళల్లో బెదురు....అటీటూ బెదురుగా

చూస్తోంది. ఆవిడ గుండెలు గుండ్రంగా ఎత్తుగా ఉన్నాయి. ఎర్ర రంగు రవికె ఆమె గుండెలను దాచలేక పోతోంది. కట్టుకున్న చీర పాతదే ఆమె గుడ్డలు తీసేస్తే బావుంటుందేమో ? ఆవిడ చంకలో నారపేదులాంటి పిల్లో, పిల్ల వాడో ఉన్నాడు. . .

ఆమె హఠాత్తుగా క్రిందికి వంగి చంకలోని ఆమె కూతురో, కొడుకునో క్రిందినుంచి నాకళ్ళకు దూరంగా నేలను తాకి మొక్కింది.

"దరమ దొరలు బాంచెన్—మా పొరగండ్ల నోటికాడిబుక్కా తియకుండ్లి బాంచెన్ – గాయింత దొయ్యలుండగనే ఓ పూటతింటె మరోపూట మాత్తన్నమ్. దొరకు ఏలెకురాల జమీనున్నది." ఇలాగా ఏదో చెప్పుకపోతోంది. కాని నాకు అవేవి విన్పించడం లేదు......... నా లోలోపల వాంఛ కదలుతోంది.

"మేమే మిచ్చుకోగలం బాంచెన్ గరీబోల్లం. . ."

నేను షాక్ తిన్నాను... నాసంగతి ఈవిడకెలా తెలుసు. . ." ఏమిచ్చుకుం టారు ? ఇవ్వడానికే వచ్చిందన్న మాట. కాని ఆర్.డి.వో.....దొర ఆర్. డి.వో. గొంతు పిసుకుతాడు. ఆర్. డి. వో. నా గొంతు పిసికేస్తడు. అంత దాకెందుకు దొర నన్ను ఈ ఊరి పొలిమేర దాట నిస్తాడా ? ఆ తరువాత దొంగ లీవు లెటరు... తరువాత కథమామూలే....

ఆమె చెప్తూనేపోతోంది. నేను బయట ముసురుకుంటున్న చీకటిని చూస్తు న్నాను..... శిశువు నా కాళ్లవేపు పాక్తు తోంది.....

నేనుదృష్టి మరల్చుకొని ఆమెను పరిశీలనగా చూశాను....ఆమె సడెన్‌గా ఆగిపోయి శిశువును ఎత్తుకున్నది .... కళ్ళల్లో భయం. . .

"గరీబోల్లం తమరికేమివ్వగలం బాంచెన్. . ." మళ్ళి అదేమాట. . . .

"ఏమివ్వాలను కున్నారు." పైకి అడుగలేదు. కాని ఆమె అర్థంచేసు కున్నది.

కాసేపు మౌనం. . . ఆతరువాత మళ్ళి అటూ యిటూ చూసి అతి తగ్గు స్వరంతో

తమరు కావాలనుకుంటే... ఈడ కాదు. పట్వారతే డొక్కసింపి డోలు కడతాడు..." ఆమె అంటోంది...

భూమికోసం-ఆమె దేన్నైనాఇవ్వ డానికి సిద్ధంగా ఉంది... భూమంటే వీళ్ళకు అంత ప్రేమా ? తనూ తీసుకునే పొజీషన్‌లో లేదు...

"గెటవుట్....వెళ్ళు... ఇక్కడ నుంచి వెళ్ళు..." నేను అరిచాను. నా అరుపు నాకే వింతగా తోచింది...

ఆ అరుపుకు లోపలి నుండి పట్వారి లాంతరుతో సహా పరుగెత్తు కొచ్చాడు.వచ్చినావిడను ఎగాదిగాలాంత రెత్తిచూసిండు.కనుబొమలుముడిచిండు.

"లంజెకానా ఈడి కెందుకచ్చి నవ్. . ." పట్వారి తిడుతున్నాడు. . . ఆమె వెళ్ళిపోతోంది-వెనక్కు తిరిగైనా చూడకుండా...

"ఏమన్న దుండ్లి..."

"తనకు భూమి కావాలన్నది."

"అనదు మరి... దానవ్వను... సంపాయించిదాయె.."

పట్వారి అకారణంగా నవ్విండు.

"ఇంకేమైన అన్నదా?" పట్వారి రంధ్రాన్వేషణ.

"మీ ఉద్దేశమేమిటి?" ఉరిమి చూశాను...

అదికాదుండ్లి- మీరు సిరాతులున్నరు- ఇంతేజాములై పోయినట్టే-తానం సేత్తే బాగుంటదేమో?" నసిగిండు...

"ముందు దొరను పిలిపించండి..." అన్నాను అఫీసర్ హోదాలో

"కచ్చీరు గదిల కూకున్నరు- తమరే.."

నేను సరాసరి దొర ముందుకు నడిచాను...

దొర కాలుమీద కాలేసుకొని సిగరెట్టు తాగుతున్నాడు. కుర్చీలో కూర్చుండు మన్నట్లుగా చూసిండు.

కూర్చున్నాను...మౌనం...

"కాలువ క్రింది భూమికి నష్టపరిహారం రూలు ప్రకారం యివ్వాల్సొంటుంది..."

"....."

నేను లేవబోయాను...

"కూరోండి. . ."దొరఅవులించిండు...

"టైమెంత ?... తెల్లారి మాట్లాడుకుందాం... ఇంతెజాములు నచ్చకుంటే మొహమాట పడకుండ్లి. . . ఇయాల్ల పది తక్కువ కానియ్యి. . . పట్వారి అన్నీ రడీయేనా ? నిన్నబాగా నిద్రపట్టిందా?"

"తమరిదే ఆలిశ్యం..." పట్వారి నావేపు చూసి వెళ్ళిపోయాడు...

దొరచెప్పక పోతున్నాడు.అంతూ పొంతూ లేని మాటలు. దొరగట్టివాడే...గట్టివాడు కానిది దొరెట్ల అవుతాడు... దేశం గురించి మాట్లాడుతున్నాడు. ప్రజల గురించి మాట్లాడుతున్నాడు... మరేదో మాట్లాడుతున్నాడు...భూమి మాటతప్ప...

ఏయే సమయంలో ఎవరెవరు ఎదురు తిరిగారో చివరకు ఏమైపోయారో పరోక్షంగా చెప్పిండు. తన కనుకూలంగా పని చేసిన వారు ఎట్లా బాగుపడిపోయారో వివరించిండు. ఆ తరువాత మంత్రుల దగ్గరి నుండి అధికార్లదాకా తనబంధువులు, మిత్రులు వగైరా...వగైరా..

"పొల్లగండ్లకు సుత తెలుసు వాళ్ళకేం గావాల్నో ? ఇన్నరా ! అవికి నట్టం కింద భూమిప్పిత్తరు. నేనిత్త... ఆడు మూన్నెల్లకు మల్లనాకే అమ్ముకుంటడు. కొనటో దుంచే అమ్మెటోనికి అవసరాలు అయే ఉంటాయి. లేకుంటే నేను పుట్టిత్త గిప్పుడు కొద్దిగొప్పల ఎల్లిపొయ్యేదివడ్డికలుపాల్సివత్తది. సమఝుయితందా ? వానికొరగే దేమున్నది ? నేమనట్టబోయే దేమున్నది. మజ్జెల నట్టబోయేది నువ్వే! బాగాఇసారం

తేమకో ! ఏ సంగతి నాకెరుకలేంది కాదు. నేను తల్చుకొంటుగని,," దొర.

నా మూలంనిండా చెమటలు పట్టినయ్. ఆ రాత్రి నాకు జరగవలసిన మర్యాదలన్ని జరిగినయ్. ఏమి కావాలనుకున్నానో అది దొరికింది. నేను కావాలనుకున్నది "ఎర్ర రవికెది" కూడా ఇస్తానన్నది. కాని నేను తీసికోలేకపోయాను. ఇంకెవతనో నా మంచాల్లో పడేలాడు దొర. రంగు సీసాలు తాగాము,

కాయితం మీద గీకేసి తెల తెలవార కుండనే వెళ్ళిపోయాము.

తరువాత వర్షకాలంలో తెలిసింది.

నా కాయితం పనిచేయలేదట- అదివరకున్న అన్ని కాయితాల హక్కులకు కాలం చెల్లిపోయిందట- అన్ని కాయితాలను, దొర హక్కులను ఎవరో కాల్చేశారట - దొర కోర్టు భవనాల చుట్టూ తిరుగుతున్నరట నాకు నిజంగా గుండె ఆగిపోతుందను కున్నాను.

కాని నా భయానికి అర్థంలేదు, ప్రభుత్వం దొర హక్కులకోసం దొర పక్షాన గట్టిగా నిలబడ్డది.... అక్కడ ప్రభుత్వం గట్టికావలా పెట్టింది. ఇప్పుడది కల్లోలిత ప్రాంతం.... మళ్ళీ నేను హద్దులు నిర్ణయించాల్సి ఉంటుందేమో?

విశ్వ జనాళికి వెలుగు

ఆ. సోమసుందర్

ప్రపంచ కార్మికులంతా ఒకటై
ప్రశాంత జీవన సాధనకోసం
ఫిరంగి గుళ్ళకు వెరవక నిలచి
బిరాన దూకిన దినమ్మిదేనోయ్!
పోరుకు నడిచిరి కార్మిక వీరులు
విప్లవ గీతాలాలాపిస్తూ!
బీటలు వారెను శత్రువు కోటలు
ఎగిరెను మింటను విజయకేతనం
వీధుల పారిన ధీరుల రక్తం
విశ్వ జనాళికి వెలుగై నిల్చెను.